
వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

ములుగు, న్యూస్‌టుడే: ఈనెల 10న ములుగులోని తోపుకుంట చెరువు కట్టపై నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాల ప్రదేశాన్ని బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర పరిశీలించారు. ఏర్పాట్లపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సాంప్రదాయ బద్ధంగా మహిళలు నిర్వహించుకునే పండగ బతుకమ్మ అని, ఉత్సవాలకు వచ్చే వారికి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలను ఘనంగా చేసుకోవాలని సూచించారు. బతుకమ్మలను నిమజ్జనం చేసే ప్రదేశంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయనతో పాటు జిల్లా అదనపు కలెక్టర్ జి. సంపత్‌రావు, ఎంపీవో రహీం, పంచాయతీ కార్యదర్శి రఘు తదితరులున్నారు.



తోపుకుంట చెరువు కట్టపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ఆనంద క్షణాలు..



హైదరాబాద్ ఎల్.బి. స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ములుగు జిల్లాకు చెందిన టి.శిరీషకు నియామక పత్రం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క

జగమేలుతోంది.. మన బతుకమ్మ

'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..
ఏమేమి కాయప్పునే గౌరమ్మ..
చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుడి ముద్దుల గుమ్మ..
ఒక్కొసి పువ్వేసి సందమామ.. బతుకమ్మ బతుకమ్మ
ఉయ్యాలో.. మమ్మేలు కోవమ్మ ఉయ్యాలో..
అంటూ ఓరుగల్లువ్యాప్తంగా బతుకమ్మ పాటలు మారుమోగుతున్నాయి..

నేడు సద్దుల బతుకమ్మ

ఎన్నో ప్రత్యేకతలు.. సంప్రదాయాల మేళవింపు

ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి, న్యూస్‌టుడే, నర్సంపేట, దేవరుప్పుల(జనగామ)

ఇంద్రధనస్సులోని వర్ణాలు కలిగిన తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మ నేడు జగమేలుతోంది.. తెలంగాణ సంస్కృతికి పూల పండగ నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది.. మన సంప్రదాయాన్ని విదేశాల్లోనూ వ్యాప్తి చేస్తున్నారు.అక్కడ స్థిరపడ్డ మనవాళ్లు అంగరంగ వైభవంగా జరుపుకొంటున్నారు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ పండగను నిర్వహించనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..



16 ఏళ్లుగా ఒక్కో అడుగు పెంచుతూ..



నర్సంపేటకు చెందిన రుద్రారపు సరోజన-మైదయ్య దంపతులు తొమ్మిది రకాల పూలతో ఏటా ఒక అడుగు పెంచుతూ పెద్ద బతుకమ్మను పేరుస్తున్నారు. 16 ఏళ్ల కిందట తొలిసారి 3 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చారు. అప్పటి నుంచి ఏటా ఒక్కో అడుగు ఎత్తు పెంచుతూ వస్తున్నారు. ఈసారి 12 అడుగుల ఎత్తుతో బతుకమ్మను పేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వారం రోజులుగా పలువురు కూలీలతో పెట్టి కొత్తగూడ, గంగారం, పాకాల అడవుల్లో గునుగు, తంగేడు, టేకు, అల్లీ పూలు, తామర, సీతజడ, బంతి, చామంతి వంటి 9 రకాల పూలను సేకరిస్తున్నారు. ఇంట్లో మహిళా కూలీలతో వాటిని కట్టలు కట్టిస్తున్నారు. ప్రత్యేకం ట్రాలీలో బతుకమ్మను మైదానానికి భాజాభజంత్రీల నడుమ తీసుకొస్తారు.

కర్ణాటకవాసులకు మక్కువ..



బతుకమ్మ పండగను కన్నడ ప్రజలు బాగా ఇష్టపడుతున్నారు. కర్ణాటకలోని హసన్ జిల్లా హళబిడ గ్రామానికి చెందిన అయ్యంగార్ యమున-రాజు దంపతులు పదేళ్ల కిందట నర్సంపేటకు వచ్చి బేకరీ నడుపుతున్నారు. ఇక్కడి ప్రజలు పూలను ఆరాధించే సంస్కృతి వారికి బాగా నచ్చింది. సొంతంగా బతుకమ్మ పేర్చి ఇక్కడి మహిళలతో కలిసి ఆడుతున్నారు.

సీతంపేటలో దీపావళికి వేడుకలు.. పురుషులూ ఆడుతారు..

భీమారం, న్యూస్‌టుడే: హసన్‌పర్తి మండలం సీతంపేటలో నేతకాని కులస్థులు దీపావళి పండగ సమయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. గ్రామస్థులు తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగిస్తున్నారు. దీపావళి రోజున పుట్టమన్ను తీసుకొచ్చి ఇళ్లలో జోడెడ్ల ప్రతిమలను తయారు చేసి పూజిస్తారు. మరుసటి రోజున కేధారేశ్వర వ్రతం చేస్తారు. జోడెడ్లను అలంకరించి ఊరేగిస్తారు. తర్వాత చెరువులో నిమజ్జనం చేస్తారు. మరుసటి రోజున సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. మహిళలతో పాటు, పురుషులు కూడా బతుకమ్మ ఆడుతారు.



విదేశాల్లోనూ సందడే..

ఒకప్పుడు తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోనే సందడి చేసిన బతుకమ్మ పండగ నేడు విశ్వవ్యాప్తమైంది. యూకేలోని వారిక్ పట్టణంలో జరిగే వేడుకలు ఉత్తరాది దక్షిణాది సంస్కృతుల మేళవింపుగా సాగుతున్నాయని తెలుగు ఆడపడుచు, అక్కడి కౌన్సిలర్ ఎల్లాప్రగడ హేమ తెలిపారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకోవడం విదేశీ మహిళలు ఆసక్తిగా గమనించి.. తమతో కలిసి వస్తున్నారని తెలుగు మహిళలు చెబుతున్నారు.



టోక్యో నగరంలో..

ముందస్తు అనుమతి తీసుకుంటాం..



- తాటిపాటి పల్లవీ-సాగర్, కోటోకు ఓజీమా వీధి, టోక్యో (దేవరుప్పుల మండలం సీతారాంపురం)

మా వీధిలో 60 వరకు తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మ పండగను అందరం కలిసి జరుపుకొంటాం. సామూహికంగా నిర్వహించాలి కాబట్టి అధికారుల ముందస్తు అనుమతి తీసుకుంటాం. గడ్డిపూలు, వివిధ రాకల పూలతో బతుకమ్మ పేర్చి, ఒక దగ్గర గుమిగూడి ఆటపాటలతో సందడి చేసి, వాయినాలు ఇచ్చుకుంటాం. సమీపంలోని నదిలో నిమజ్జనం చేస్తాం.

వంటకాలను ఇచ్చిపుచ్చుకుంటాం..



- పెద్దాపురం మమత, అల్బనీ, అమెరికా, (దేవరుప్పుల)

అల్బనీ ప్రాంతంలో బతుకమ్మకు ప్రత్యేకంగా పూలు తెచ్చి మార్కెట్‌లో అమ్ముతుంటారు. ఇక్కడ తెలుగు సహా ఇతర రాష్ట్రాల మహిళలు కలిసి వేడుకలు జరుపుకొంటారు. సద్దుల బతుకమ్మ నాడు వండిన వంటకాలను ఒకరికొకరం పంచుకుంటాం.

ఇంట్లోనే నిమజ్జనం..

- గాదె ఉషశ్రీ, చెక్ రిపబ్లిక్, (దేవరుప్పుల)



మేము ఉండే దగ్గర 25-30 తెలుగు కుటుంబాలున్నాయి. బతుకమ్మను ఎవరి నివాసంలో వారే నిర్వహించి, అష్టమి రోజు ఒక నీటి తొట్టి ఏర్పాటు చేసుకొని నిమజ్జనం చేస్తాం. వీలును బట్టి అందరి ఇళ్లు కలియతిరిగి శుభాకాంక్షలు చెప్పుకొంటాం.

● కెనడా రాజధాని అటవా నగరంలో వరంగల్ జిల్లాకు చెందిన పలు అనేక కుటుంబాలు స్థిరపడ్డాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తికి మండలం దండేపల్లికి చెందిన సుధీర్ కోదాటి ఈ ప్రాంతంలోని తెలుగువారిని సంఘటితం చేసి గత 15 ఏళ్లుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. తెలుగు అసోసియేషన్ నిర్వహించే బతుకమ్మ వేడుకలకు బంగారు నాణేలు, 500 డాలర్లు బహుమతులుగా ఇస్తున్నారు. 19 ఏళ్ల కింద అమెరికాలోని షికాగాలో స్థిరపడిన వర్ధన్నపేటకు చెందిన పూర్ణచందర్ అల్లమనేని 2003 నుంచి ఘనంగా సంబరాలు జరుపుతున్నారు.

గీత కార్మికుడికి రక్షణ కాటమయ్య కిట్



పంపిణీ చేస్తున్న అధికారులు

ములుగు టౌన్, న్యూస్‌టుడే: గీత కార్మికులు కాటమయ్య కిట్టుతో వృత్తి చేసుకోవాలని బీసీ సంక్షేమ అధికారి రవీందర్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ పాలకుర్తి లింగారెడ్డి పేర్కొన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో జరిగిన రెండో విడత కాటమయ్య కిట్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా వంద మంది గీత కార్మికులకు కిట్లను అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ కిట్లు కార్మికులకు రక్షణగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి, గీత కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు



దివ్యాంగులతో ఎస్పీ శబరీష్, అధికారులు

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాల బారిన పడొద్దని జిల్లా ఎస్పీ శబరీష్ పేర్కొన్నారు. హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ గత ఐదు రోజులుగా ఏటూరునాగారం మండలంలో పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్తంగా మ్యాచ్ నిర్వహించాయి. ఈ పోటీల్లో పోలీస్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమానికి హాజరైన ఎస్పీ ముగ్గురు దివ్యాంగులకు వీల్ ఛైర్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్య స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాలకు రూ.20 వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యువత క్రీడలను వృత్తిగా ఎంచుకొంటే భవిష్యత్తులో అంతులేని కీర్తి, ప్రతిష్ఠలు పొందొచ్చన్నారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వీటితో జీవితాలు నాశనమవుతాయని తెలిపారు. లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు టౌన్, న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల సంస్మరణార్థం ఈ నెల 21వ తేదీన జరిగే ఫ్లాగ్ డేను పురస్కరించుకుని నిర్వహించనున్న ఫొటోగ్రఫీ, లఘుచిత్ర పోటీలకు జిల్లాలోని ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పోలీసు అధికారి శబరీష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసుల త్యాగాలు, విధి నిర్వహణలో కనబరుస్తున్న ప్రతిభ, తెగువను చూపే విధంగా తీసిన మూడు చిత్రాలు, మూడు నిమిషాల నిడివి కలిగిన లఘు చిత్రాలను పంపించాలన్నారు. ఈనెల 20వ తేదీ సాయంత్రంలోగా సమీపంలోని పోలీసు స్టేషన్లు, ములుగు డీఎస్పీ కార్యాలయంలో అందించాలని కోరారు.

ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వ నిర్ణయం



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

మల్లూరు(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలోని మల్లూరు పంచాయతీ పరిధి మామిడిగూడెంలో గిరిజన సొసైటీ ద్వారా ఇసుక క్వారీని ఏర్పాటు చేయడానికి గ్రామ ప్రజల నుంచి పర్యావరణ అభిప్రాయ సేకరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మామడిగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ శ్రీ సాయి నేచర్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మల్లూరు కేంద్రంలో సుమారు 10 కిలోమీటర్ల విస్తీర్ణంలో జరిపిన పరిశీలన అంశాలను గ్రామసభలో చదివి వినిపించారు. అనంతరం ఉమ్మడి వరంగల్ జిల్లా కాలుష్య నియంత్రణ మండలి (ఈపీసీడీ)అధికారిని సునీత మాట్లాడారు. మామిడిగూడెం సమీప గోదావరిలో సుమారు 15 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు మూడు లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వడానికి ప్రభుత్వం అనుమతులిచ్చినందున ప్రజలు క్వారీల ఏర్పాటుపై తమ అభిప్రాయాలను చెప్పాలని కోరగా, మల్లూరు గ్రామ ప్రజలు సభలో వారి మిశ్రమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన కొందరు గిరిజనేతరులు మాట్లాడుతూ.. గోదావరి నది గ్రామం మొత్తానికి సంబంధించిందని, క్వారీలో పనులు చేయడానికి గిరిజనేతరులకు కూడా అవకాశం కల్పించాలన్నారు. నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేస్తుండటంతో.. భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి ఎద్దడి సమస్య తలెత్తిందన్నారు. ఇప్పటికే పాతబావుల్లో నీటి చుక్కలేకుండా పోయిందని, మోటార్ల నుంచి తక్కువ నీరు వస్తుందని, హానీ చేసే విధంగా తవ్వకాలు ఉండొద్దన్నారు. రెండు మీటర్లకు అనుమతి ఉంటే నాలుగు మీటర్ల లోతు తవ్వుతున్నారని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందన్నారు. క్వారీ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేవని సభలో వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అభిప్రాయాలు విన్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ మాట్లాడుతూ.. ఇసుక క్వారీ ఏర్పాటు విషయంలో ప్రజల అభిప్రాయం మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన ప్రతి విషయాన్ని పర్యావరణ మంత్రిత్వ శాఖకు పంపిస్తామని అధికారిణి సునీత సభలో ప్రకటించారు. మైనింగ్ ఏడీ జయరాజు, మినరల్ డెవలప్‌మెంట్ పీవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వందేభారత్ తయారీ ఇక్కడే!

వివరాలు 14లో..

రామప్పలో అందెశ్రీ



వెంకటాపూర్, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రామప్పను ప్రముఖ కవి, గేయ రచయిత అందెశ్రీ బుధవారం సందర్శించారు. ముందుగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. టూరిజం గైడ్లు ఆలయ చరిత్ర, శిల్పకళా వైభావాన్ని వివరించారు. అద్భుత శిల్పాలను ఆయన తన కెమెరాలో స్వయంగా బంధించుకొన్నారు.

నియామక పత్రాల కోసం తరలిన అభ్యర్థులు



ములుగులో

ములుగు, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024లో ఎంపికైన ఉపాధ్యాయులు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకునేందుకు హైదరాబాదు వెళ్లారు. జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర ఆధ్వర్యంలో ములుగు జిల్లా నుంచి ఎంపికైన 178 మంది ఉపాధ్యాయులను ములుగు, ఏటూరునాగారం, తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల పరిధిలో నాలుగు బస్సులు ఏర్పాటు చేసి తరలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌర్యం కలగకుండా నలుగురు లైజనింగ్ అధికారులు, ఎనిమిది మంది సహాయ లైజనింగ్ అధికారులు, ప్రతి బస్సులో వైద్య, పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంచారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన వసతి ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని, కలెక్టర్ కార్యాలయ ఏవో రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కష్టాలు అధిగమించి.. కొలువు సాధించి..!

వెంకటాపురం, న్యూస్‌టుడే: నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల్లో జన్మించారు. తల్లిదండ్రులు పడే కష్టాన్ని చూశారు. పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా చదివారు. కలలను సాకారం చేసుకుని గురువులుగా సర్కారు కొలువును సాధించారు. డీఎస్సీ 2024లో ప్రతిభను చాటి ఉపాధ్యాయులుగా నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా విజేతల మనోగతం వారి మాటల్లోనే..

దూరవిద్యలో చదివి..



గొడిశాల పాపారావు

రెక్కాడితేగాని డొక్కాడని దీనస్థితి గొడిశాల పాపారావుది. ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలోనే అనారోగ్యంతో తండ్రి మరణించారు. తల్లి ప్రోత్సాహంతో ఇంటర్ పూర్తి చేశారు. ప్రభుత్వ కళాశాలల్లోనే డీఎడ్, బీఈడీ అభ్యసించారు. దూరవిద్య ద్వారా డిగ్రీ చదివి, విద్యావాలంటీర్‌గా పని చేశారు. భద్రాద్రి జిల్లా చర్లలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పని చేస్తూ.. డీఎస్సీ ద్వారా ఎస్‌జీటీకి ఎంపికయ్యారు. గత నాలుగేళ్లుగా పాపారావు తల్లి అనారోగ్యంతో మంచానికే పరిమితం కాగా, భార్యతో పాటు ఇద్దరు పిల్లలను ప్రైవేటు టీచర్‌గా పని చేస్తూ పోషించుకుంటున్నాడు.

తండ్రి మృతిచెందినా..



నరిగె రమేశ్

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం సోమల గడ్డ గ్రామానికి చెందిన నరిగె రమేశ్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. రమేశ్ పీజీ చేస్తున్న సమయంలో తండ్రి సోమలింగయ్య మృతిచెందారు. తండ్రి మరణం రమేశ్‌ను తీవ్రంగా కుంగదీసింది. నలుగురు కొడుకులు ఉన్న కుటుంబంలో రమేశ్ చిన్న వాడు. తల్లి కూలి పని చేస్తూ.. రమేశ్‌కు సాయం అందించింది. 2017 డీఎస్సీకి సిద్ధమవగా, అర మార్కులో అవకాశం చేజారింది. ఇంట్లో వాళ్లు ఇక లాభం లేదంటూ పెళ్లి చేసి బాధ్యత తీర్చుకున్నారు. కుటుంబ పోషణ కోసం ప్రభుత్వ కళాశాలలో అతిథి అధ్యాపకుడిగా పనిచేస్తూ.. భార్య ప్రోత్సాహంతో ఏడేళ్ల పాటు కఠోరంగా శ్రమించి పట్టువదలని విక్రమార్కుడిలా 2024 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించాడు.

పంతులమ్మలైన అత్తాకోడళ్లు



నీరజాప్రవళిక, వందన

వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన కొండపర్తి నీరజాప్రవళిక, మంగపేట మండలం మల్లూరుకు చెందిన రాచకొండ వందన ఇరువురు బంధువులు. అత్తాకోడళ్లైన వీరిద్దరూ ఎస్‌జీటీలుగా నియామకం కావడంతో రెండు కుటుంబాల్లో సంతోషం వ్యక్తమైంది. నీరజాప్రవళిక ఎంఎస్సీ, బీఈడీ, డీఎడ్ పూర్తి చేసింది. భర్త నాగేంద్రప్రసాద్ ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారంతో సర్కారు కొలువులో చేరింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన వందన బీఏ, డీఎడ్ చదివారు. ఎస్‌జీటీగా ఎంపికై నియామక పత్రం అందుకున్నారు.

శెభాష్.. హరీశ్..



వెంకటాపురం మండల కేంద్రం చర్ల్పేటకు చెందిన పందా హరీశ్ కష్టాలను ఎదిరొడ్డారు. తండ్రి దినసరి వేతనంపై పనిచేస్తున్నారు. విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ బడులు, కళాశాలల్లోనే పూర్తి చేశారు. ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసిన హరీశ్ ఈ ఏడాది ఆగస్టులో టీజీటీ ద్వారా మహబూబాబాద్ జిల్లా మరిపెడలోని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన గురుకులంలో ఎస్‌ఏ లెక్కల ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. ప్రస్తుత డీఎస్సీలో ప్రతిభ చాటి స్కూల్‌అసిస్టెంట్ లెక్కల ఉపాధ్యాయుడిగా కొలువును సాధించారు.

ఉపాధ్యాయులుగా అన్నదమ్ములు



సాగర్



సందీప్

కన్నాయిగూడెం, న్యూస్‌టుడే: ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములిద్దరూ పట్టుదలతో కొలువు సాధించారు. కన్నాయిగూడెం మండలంలోని మారుమూల గ్రామమైన ముప్పనపల్లికి చెందిన అన్నదమ్ములు పైడాకుల సాగర్, సందీప్ ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎస్జీటీ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. పేద కుటుంబానికి చెందిన వీరు కష్టపడి చదివి ఉద్యోగాలను సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

ప్రస్తుతం మడికొండలోని మెట్టుగుట్ట సీతారామాంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన 240 ఎకరాల దేవాదాయశాఖ భూములు ఉన్నాయి. ఇందులో 160 ఎకరాలు రైల్వేకు ఇచ్చారు. మిగిలిన స్థలం కూడా కోచ్‌ల నిర్మాణానికి కేంద్రం సేకరించే అవకాశాలున్నాయి.

వందేభారత్ తయారీ ఇక్కడే!

- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కల సాకారం..
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటనతో ఆనందం
- అదనంగా రూ.66 కోట్లు మంజూరు



ఓరుగల్లు ప్రజల చిరకాల వాంఛ నెరవేరే రోజు వచ్చింది. గత 45 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో జరిగిన ఓ సమావేశంలో కాజీపేటలో కోచ్‌లు తయారు చేస్తామని ప్రకటించడం ఆశలు రేపాయి. రైల్వే జంక్షన్ కాజీపేటలోని అయోధ్యపురం వద్ద నిర్మిస్తున్న వ్యాగన్ తయారీ కేంద్రాన్నే అప్‌గ్రేడ్ చేసి కోచ్‌లు తయారు చేయాలని కేంద్రం భావిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎక్కువ డిమాండ్ ఉన్న వందే భారత్ రైలు కోచ్‌లు ఇక్కడ తయారు చేయాలని నిర్ణయించడం కాజీపేటకు గొప్ప మలుపు కాబోతోంది.

కాజీపేట, న్యూస్‌టుడే



నిర్మాణంలో భారీ షెడ్

ఒక్కో అడుగు పడుతూ..

వరంగల్ ప్రజల నాలుగు దశాబ్దాల ఉద్యమ ఫలితమే కోచ్ ఫ్యాక్టరీ. 1980 దశకంలో కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కోసం ఉద్యమం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం సైతం మంజూరు చేసింది. డీజిల్ షెడ్ పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. పంజాబ్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ పరిశ్రమలు నెలకొల్పి యువతను ఆకట్టుకోవాలనే ఆలోచనతో కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని కపుర్తాలకు మార్చారు. అప్పటి నుంచి కోచ్ ఫ్యాక్టరీ కోసం ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. 2010లో వ్యాగన్ మరమ్మతుల వర్క్‌షాపు, వ్యాగన్ తయారీ కేంద్రాన్ని సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. అక్కడ స్థలం లేకపోవడంతో కాజీపేటకు తరలించారు. ఇక్కడా స్థల సేకరణలో ఆలస్యమైంది. చివరికి 2016లో వ్యాగన్ షెడ్ కోసం నిధులు కేటాయించారు. ఎట్టకేలకు 2023లో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపు పనులను ప్రారంభించారు. స్థానికులు దీనిపై అసంతృప్తిగా ఉండటంతో వ్యాగన్ రిపేర్ వర్క్‌షాపుతో పాటు పిరియాడికల్ ఓవరాహాలింగ్ కేంద్రాన్ని సైతం మంజూరు చేశారు. కోచ్ మీద ఉన్న ఆశ అలాగే ఉంది. స్థానిక రైల్వే ఐకాస ఆధ్వర్యంలో కోచ్ సాధన సమితి పేరు మీద ఆందోళన చేశారు. చివరకు దేశవ్యాప్తంగా వందేభారత్ రైలు కోచ్‌లకు డిమాండ్ ఉండటంతో వ్యాగన్ తయారీ పరిశ్రమను, పీఓహెచ్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అభివృద్ధి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.



సిద్ధంగా క్రేన్లు

అడ్డంకులు లేకుండా ఉన్న స్థలంలోనే..

కోచ్ ఫ్యాక్టరీకి మరింత స్థలం అవసరం. సేకరణకు సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి 160 ఎకరాలను సేకరించి వ్యాగన్ పరిశ్రమను నెలకొల్పుతున్నారు. రెండు ప్రధాన షెడ్ల నిర్మాణం, కార్యాలయాల భవనాలు నిర్మిస్తున్నారు.. దీనికి అదనంగా మరో షెడ్‌ను నిర్మించడానికి రూ.66 కోట్లను కేంద్రం విడుదల చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న 160 ఎకరాల్లోనే కోచ్ ఫ్యాక్టరీని నిర్మిస్తారు. ప్రస్తుతం ఉన్న స్థలాన్ని పూర్తి సామర్థ్యం మేరకు వినియోగించుకోవాలని చూస్తున్నారు.. రాబోయే రోజుల్లో అదనపు స్థలం సేకరించి మరింత విస్తరిస్తారు.

చెన్నై ఇంటగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో

చెన్నై పెరంబూరులో గల ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో ఇక్కడ నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ వందే భారత్ కోచ్‌లు తయారవుతున్నాయి. దీనికి అదనంగా ఇప్పుడు కాజీపేటలో ప్రారంభం అవుతాయి.

3000 మంది సిబ్బంది..

కోచ్ ఫ్యాక్టరీకి 3000 మంది సిబ్బంది అదనంగా రానున్నారు. పీఓహెచ్, వ్యాగన్ పరిశ్రమలకు 2000 మంది అవసరం అవుతారు. రెండు పరిశ్రమలకు కలిపి మొత్తం 5000 మంది కార్మికులు వచ్చే అవకాశం ఉంది. ముందుగా వందేభారత్ రైళ్ల కోచ్‌ల తయారీపైనే దృష్టి పెడుతున్నారు. షెడ్ నిర్మాణం కాగానే తయారీ యంత్రాలను అమరుస్తారు. పెరంబూరు కోచ్ ఫ్యాక్టరీలో పనిచేసే నిపుణులను రప్పించి ఇక్కడి కార్మికులు, అధికారులకు శిక్షణ ఇస్తారు. కోచ్‌ఫ్యాక్టరీ పూర్తి స్థాయిలో పనిచేస్తే రాంపూర్, కాజీపేట ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. అనుబంధ పరిశ్రమలు వస్తాయి.



రైల్వే వ్యాగన్ల తయారీ కేంద్రం షెడ్



వ్యాగన్ పరిశ్రమ కార్యాలయం

అంకెల్లో వివరాలు..

- కోచ్ ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వ గతిశక్తి పథకం కింద ఏర్పాటు చేస్తోంది.
- వ్యాగన్ షెడ్ కాజీపేటలో ప్రతిపాదించిన సంవత్సరం- 2013
- కేటాయించిన నిధులు రూ.521 కోట్లు
- మొదటి దశలో విడుదలైనవి రూ.220 కోట్లు
- వ్యాగన్ తయారీ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసింది: 2023
- పీఓహెచ్‌గా అప్‌గ్రేడ్ అయింది: 2023
- కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యేది: 2025-26


పడిలేచిన కెరటం..

తపాలా సేవలు ఆదర్శం



ఒకప్పుడు ఇంటి ముందు పోస్ట్.. అన్నమాట వినపడగానే ఇంట్లో అందరి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసేది. దూరాన ఉన్న బంధువుల యోగక్షేమాలను అది మోసుకొచ్చేది. మన క్షేమ సమాచారం తీసుకెళ్లేది. ఇంటింటిని పలకరించే ఆత్మీయ బంధువులా తపాలాశాఖ ఉండేది. సమాచార సాంకేతిక పరిజ్ఞానం పెరిగి అంతర్జాలం, చరవాణులు అందుబాటులోకి వచ్చాక ఉత్తర ప్రత్యుత్తరాలు కనుమరుగయ్యాయి. మనియార్డర్లు పంపేవారు లేరు. తపాలాశాఖ ప్రాభవం కోల్పోయే పరిస్థితి నుంచి మళ్లీ కోలుకుంది. వినూత్న సేవలతో ప్రజాదరణ పొందుతోంది. గురువారం జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. – న్యూస్‌టుడే, శివనగర్

గ్రామస్థాయిలో పటిష్ఠ సమాచార, మానవ వనరులతో కూడిన వ్యవస్థ ఒక్క తపాలాశాఖకే సొంతం. వర్షం కురిసినా.. వరదలు పొంగినా తోకలేని పిట్ట తొంభై మైళ్లు వెళ్తుంది. అందుబాటులోకి వచ్చిన ఆధునిక సమాచార సాంకేతిక వ్యవస్థ తోడుతో తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయి. సేవలను అందించడంలో వేగం పెరిగింది. సాధారణ సేవలతో పాటు పొదుపు, బీమా, బ్యాంకింగ్ రంగంలోనూ అడుగిడింది.



అందిస్తున్న సేవలు..

సాధారణ తపాలా సేవలతో పాటు స్పీడ్‌పోస్టు, క్యాష్ ఆన్ డెలివరి (సీవోడీ), ఎలక్ట్రానిక్ మనీ ట్రాన్స్‌ఫర్, ఆధార్ అప్‌డేట్ (సవరణ), తిరుమల తిరుపతి దేవస్థానం దర్శనం టికెట్లు, మైస్టాంప్, వెస్టర్న్ మనీ ట్రాన్స్‌ఫర్. ● పొదుపు ఖాతాలు, రికరింగ్ డిపాజిట్లు, కిసాన్ వికాస పత్రాలు, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సీనియర్ సిటిజన్స్ సేవింగ్ స్కీమ్, సుకన్య సమృద్ధి యోజన ఖాతా, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, నెలవారీ ఆదాయ పథకం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు, 1 నుంచి 5 ఏళ్ల టైమ్ డిపాజిట్ ఖాతాలు, తపాలా బ్యాంకు, ఏటీఎం.

మీసేవ తరహాలో..

విమాన, బస్సు, రైలు టికెట్ల రిజర్వేషన్, అన్ని రకాల బీమా పథకాలు, ఇంటి, నల్లా పన్నులు, గ్యాస్ బిల్లులు, ఈఎంఐ చెల్లింపులు, ఫాస్ట్‌ట్యాగ్, ఐటీ రిటర్న్స్, సెల్‌ఫోన్ సిమ్‌కార్డు రీఛార్జి, పాన్‌కార్డు, పాస్‌పోర్టుకు దరఖాస్తులు, పీఎం ఫసల్ బీమా, పీఎం జన్ ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి శ్రమయోగి మన్‌ధన్ యోజన (పీఎం-ఎస్‌వైఎం), ప్రధాన మంత్రి లఘు వ్యాపారి మన్-ధన్ యోజన (పీఎం-ఎల్‌వీఎం), ప్రధానమంత్రి ఆత్మ నిర్భర్ నిధి (పీఎం స్వనిధి), నేషనల్ పెన్షన్ సిస్టం, జీవన్ ప్రమాణ్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్) జారీకి దరఖాస్తు, ఇ-డిస్ట్రిక్ట్ సేవలు.



వరంగల్ ప్రధాన తపాలా కార్యాలయంలో సేవలందుకుంటున్న వినియోగదారులు

వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఇలా.. వరంగల్, హనుమకొండ డివిజన్ల పరిధిలో ఐదు ప్రధాన, 90 సబ్ యూనిట్, గ్రామస్థాయిలో 679 తపాలా కార్యాలయాలు పనిచేస్తున్నాయి.


లేఖల్లోనే మాట్లాడుకునేవాళ్లం..

- రామ్మూర్తి, విశ్రాంత జైలర్, శివనగర్ (వరంగల్)



నేను 1985 నుంచి తొమ్మిదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా (ప్రస్తుతం వైఎస్ఆర్ జిల్లా) ప్రొద్దుటూరు సబ్ జైల్ సూపరింటెండెంట్‌గా పనిచేశాను. నా భార్య సత్యవతి వరంగల్‌లో ఉండేది. ఆమెకు నాలుగు రోజులకు ఒక లేఖ రాసేవాడిని. ఆమె యోగక్షేమాలు, పిల్లలు ఎలా చదువుతున్నారు, వారి ఆరోగ్యం ఎలా ఉందంటూ.. ఉత్తరాల ద్వారా అడిగేవాన్ని. ఆమె రాసిన ఉత్తరం చదువుతుంటే ఆమె మాట్లాడుతున్నట్లే అనుభూతి పొందేవాడిని. టెలికాం రంగం ఎంత అభివృద్ధి చెందినా భావవ్యక్తీకరణ, మనసును కదిలించడం ఉత్తరానికే దక్కుతుంది..

పథకాలపై విస్తృత ప్రచారం



తపాలా పథకాలు, సేవలపై విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రధాన గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) సేవలను ఎక్కువగా ఉపయోగించుకునేలా డిజిటల్ సేవలను విస్తృతం చేశాం.

- రవికుమార్, సూపరింటెండెంట్, వరంగల్

చదువుల తల్లిగా భద్రకాళి!



రంగంపేట(వరంగల్), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం వరంగల్ జిల్లాలోని భద్రకాళి అమ్మవారు సరస్వతీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. లలిత పంచమి పర్వదినం కావడంతో అమ్మ సన్నిధిలో పిల్లలతో అక్షరాలు దిద్దించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి రథసేవ నిర్వహించారు. శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. చదువుల తల్లిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

● 'మహాష్టమి(దుర్గాష్టమి) రోజున కోటి యోగిని గణములతో శ్రీభద్రకాళి అమ్మవారి జన్మించారు. అందుకే మహాష్టమి పర్వదినాన సద్దుల బతుకమ్మ ఆడతారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయని' ఈవో శేషుభారతి తెలిపారు.

పీహెచ్‌డీ ప్రవేశాలపై సద్దుమణగని ఆందోళన



రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారును అడ్డుకుంటున్న విద్యార్థులు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం విద్యార్థులు చేస్తున్న ఆందోళన సద్దుమణగడం లేదు. బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టిన విద్యార్థులు పీహెచ్‌డీ- 2022 కేటగిరి-2 రెండో జాబితాలో ప్రవేశాలు కల్పించాలని రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కారుకు అడ్డంగా బైఠాయించారు. తమకు ప్రవేశాలు కల్పించే వరకు వెళ్లనిచ్చేది లేదని భీష్మించడంతో కేయూ రాణా ఎస్ఐ రాజ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి వారిని నిలువరించారు. విషయాన్ని ఇన్‌ఛార్జి ఉప కులపతి వాకాటి కరుణకు వివరించి, న్యాయం జరిగేలా చూస్తానని రిజిస్ట్రార్ హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో మంద నరేష్, రాకేష్, మనోహర్, తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

దేశాలు దాటి వెళ్లి.. మృతదేహమై తిరిగొచ్చి!



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జనగామ టౌన్, న్యూస్‌టుడే: ఉగాండాలో సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్న జనగామకు చెందిన ఇటికాల తిరుమలేశ్ తాను పని చేసే కంపెనీలోనే సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో శుక్రవారం మృతి చెందిన విషయం విదితమే. ఈ క్రమంలో ఉగాండా నుంచి ఐదు రోజులకు బుధవారం తిరుమలేశ్ మృతదేహం జనగామ పట్టణం గిర్నిగడ్డలోని స్వగృహానికి మధ్యాహ్నం 1 గంటకు చేరుకుంది. తిరుమలేశ్ మృతదేహంతో పాటు ఆయన భార్య సునీత, కుమారుడు వరుణ్ ఉగాండా నుంచి వచ్చారు. జనగామలో ఉన్న మృతుడి తల్లి కిష్టమ్మ, సోదరుడు చిన్నా, చెల్లెలు హేమలతతో పాటు కుమార్తె అఖిల ఐదు రోజులుగా మృతదేహం కోసం నిరీక్షిస్తూ కన్నీటి పర్యంతంలో మునిగిపోయారు. 'దేశం కాని దేశం వెళ్లి... శవంగా వచ్చావా.. బిడ్డా.. నీ భార్య పిల్లలను ఆగం చేసితివా బిడ్డా..' అంటూ తల్లి కిష్టమ్మ విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ ప్రజలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తిరుమలేశ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పిల్లల చదువుకు అవసరమైతే బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చి, ఆర్థిక సాయం అందజేశారు. అంత్యక్రియలు పట్టణంలోని మార్కెట్ సమీప శ్మశాన వాటికలో సాయంత్రం 6గంటలకు ముగిసాయి.

నిరుపేద కుటుంబంపై దీర్ఘకాలిక జబ్బు పంజా

● గంటల వ్యవధిలో తల్లీకుమారుడు మృతి



తల్లి చిదురాల శోభతో సాయికిరణ్

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: వారికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబం. భార్య, భర్త, ఇద్దరు కుమారులు రోజూ పనిచేసుకొని జీవించేవారు. దీర్ఘకాలిక జబ్బు బారినపడిన తల్లి, కుమారుడు ఒకేరోజు గంటల వ్యవధిలో మృతి చెందారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు గ్రామానికి చెందిన చిదురాల లక్ష్మణ్ తాపీమేస్త్రీగా, భార్య శోభ (53) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. శోభకు రెండేళ్ల కిందట బోన్ టీబీ సోకగా.. గ్రామంలోనే మోటార్ మెకానిక్ పని చేస్తున్న చిన్న కుమారుడు సాయికిరణ్ (25) ఏడాది కిందట నోటి క్యాన్సర్‌కు గురయ్యాడు. ఉన్నంతలో ఆసుపత్రులకు తిరిగి ఖర్చు చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. మంచానికే పరిమితమైన తల్లి బుధవారం ఉదయం మృతి చెందగా.. రెండు గంటల వ్యవధిలో కుమారుడు సైతం కన్ను మూశాడు. బతుకమ్మ, శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఒకే ఇంట్లో ఇద్దరి మృతి ఆ కుటుంబం, గ్రామంలో విషాదం నింపింది. అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామస్థులే విరాళాలు వేసుకొని ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

డీడీ పోచంపై చర్యలు తీసుకోవాలి

ఏటూరునాగారం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పోచంపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏటూరునాగారంలోని ఆదివాసీ భవన్‌లో బుధవారం ఉపాధ్యాయ సంఘాల ఐకాస, ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ), ఆదివాసీ నవనిర్మాణ సేన, ఆదివాసీ సంక్షేమ పరిషత్, తెలంగాణ గిరిజన సంఘం, గోండ్వాన పరిషత్ నాయకులు సమావేశమయ్యారు. ఐటీడీఏ విద్యావిభాగాన్ని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ పోచం వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలను నిర్లక్ష్యం చేస్తున్నాడని, ఆదివాసీ విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయ, ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాడని ఆరోపించారు. దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించి డీడీ పోచంను తొలగించకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

పరిశుభ్రతతోనే వ్యాధులకు అడ్డుకట్ట


వెంకటాపురం అంబేడ్కర్‌నగర్ శిబిరంలో..

వెంకటాపురం, న్యూస్‌టుడే: పరిసరాల పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతను విధిగా పాటిస్తే వ్యాధులకు అడ్డుకట్ట వేయొచ్చని వైద్యులు సూచించారు. జిల్లాలో బుధవారం పలు చోట్ల వైద్య శిబిరాలు నిర్వహించారు. వెంకటాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురికి సేవలందించారు. అనారోగ్యం, జ్వరాలతో బాధపడుతున్న వారికి చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోనే సేవలు పొందాలన్నారు. కాలానుగుణంగా వ్యాపిస్తున్న వ్యాధుల పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దోమ తెరలను వినియోగించుకోవాలన్నారు. ఈ శిబిరంలో సంచార వైద్యాధికారి కిరణ్‌కుమార్, వైద్యసిబ్బంది, సంచార బృందం సేవలందించారు.

ములుగు రూరల్: ములుగు మండలంలోని పత్తిపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాయినిగూడెం వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ములుగు, వెంకటాపూర్ ప్రోగ్రామ్ అధికారి రణధీర్, ఏఎంఓ దుర్గారావు శిబిరాన్ని సందర్శించారు. వేడి చేసిన మంచినీటినే తాగాలని, వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాస్కర్, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


ములుగు మండలం పత్తిపల్లిలో

ఉపాధి కూలీల బిల్లులు విడుదల చేయాలని వినతి

మంగపేట, న్యూస్‌టుడే: ఉపాధి హామీ కూలీల బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కూలీలు ఉపాధి హామీ ఏపీవో ఎండీ అంకూస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జాగటి చిన్నా మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా ఉపాధి హామీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంతవరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి, నాయకులు నరేష్, కూలీలు ఇప్ప సమ్మయ్య, చెట్టుపల్లి రామకృష్ణ, రామ్మోహన్, సావిత్రమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మంగపేట శ్రీ ఉమాచంద్రశేఖరస్వామి ఆలయంలో


ములుగులోని రామాలయం ప్రాంగణంలో..


వెంకటాపురం మండలం రజకవీధిలో


బెస్తగూడెంలో


తారకరామా కాలనీలో..

శ్రీసరస్వతీదేవి అలంకారంలో దుర్గామాత


అమ్మవారికి 55 రకాల పదార్థాలతో నైవేద్యం


వాజేడు మండలం ధర్మారంలో..


గోవిందరాజస్వామి గుడిలో కుంకుమ పూజలో పాల్గొన్న చిన్నారులు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత భక్తులకు సరస్వతీదేవి రూపంలో దర్శనమిచ్చింది. బుధవారం మూల నక్షత్రం కావడంతో ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలను నిర్వాహకులు, అర్చకులు సరస్వతీ దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా అర్చకులు చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను సమర్పించారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమం జరిగింది.

– న్యూస్‌టుడే, యంత్రాంగం


పస్రా శ్రీ రామాలయం వద్ద అన్నదాన కార్యక్రమం

తాగునీటి తంటాలు తీర్చండి..!

వెంకటాపురం, న్యూస్‌టుడే: వెంకటాపురం మండలం బీసీఎం త్రిగూడెం పంచాయతీలో తాగునీటి తంటాలు తీవ్రమయ్యాయి. నేలపాటిపేట, అప్పలదీవి, బీసీఎంత్రిగూడెం గ్రామాలకు మిషన్ భగీరథ శుద్ధజలం సరఫరాలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. గత కొంతకాలంగా మంచినీరు పంపిణీ లేకపోగా పంచాయతీకి చెందిన డైరెక్టు పంపింగ్ మోటారు సైతం మరమ్మతుతో మూలన పడటంతో ఇక్కట్లు తప్పడం లేదు. ఎప్పుడు మంచినీరు వస్తుందో తెలియక గ్రామీణులు కన్నీటి కష్టాలతో కాలం గడుపుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలను సైతం అరికట్టకపోవడంతో ఇంటింటికి శుద్ధజలం సరఫరా కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని వెంకటాపురం పంచాయతీకి చెందిన కాలనీలకు వెళ్లి బిందెలతో నీటిని తెచ్చుకుని గొంతు తడుపుకొంటున్నట్లు ఆ గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా.. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మోటారు మరమ్మతులు చేపట్టి డైరెక్టు పంపింగ్ ద్వారా సరఫరా చేస్తామని, లీకేజీలను సైతం నియంత్రించేందుకు అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.


మరమ్మతుకు గురైన డైరెక్టు పంపింగ్ మోటారు

పడకేసిన పారిశుద్ధ్యం..!



రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డులు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం గ్రామాల్లోని చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాల్సిన పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. ములుగు మండలం మల్లంపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీలో రోడ్డు పక్కనే చెత్త వేస్తున్నారు. చెత్త కుప్పల్లో కోతులు, కుక్కలు సంచరిస్తుండటంతో.. ఈ ప్రాంతం అధ్వానంగా తయారైంది. దుర్వాసన వస్తోందని, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది స్పందించి చెత్త తొలగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ములుగు రూరల్

ప్రశాంతంగా పండగ జరుపుకోవాలి



ఏటూరునాగారం, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ నక్సల్స్‌కు స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రశాంత జీవనం గడుపుతున్న మాజీ నక్సల్స్ పండగ సందర్భంగా గొడవలకు కారణం కాకూడదన్నారు. గ్రామాల్లో సంఘ విద్రోహశక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై తాజోద్దీన్ పాల్గొన్నారు.

పోగొట్టుకొన్న బంగారం అందజేత

వెంకటాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని పాలంపేట రామప్ప దేవాలయంలో ఓ భక్తురాలు పోగొట్టుకొన్న రూ.లక్ష విలువైన బంగారాన్ని ఆలయ సిబ్బంది తిరిగి అప్పగించిన సంఘటన బుధవారం జరిగింది. ఆలయ సిబ్బంది కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన రామకృష్ణ అనే భక్తుడు కుటుంబ సమేతంగా మంగళవారం రామప్పకు వచ్చారు. పూజలు నిర్వహించిన అనంతరం గైడ్ ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకొంటున్న క్రమంలో అతడి భార్య రూ.లక్ష విలువైన బంగారం ఉన్న చేతి సంచిని నందీశ్వరుడి వద్ద మరిచిపోయి మేడారం సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వెళ్లిపోయారు. మేడారంలో బ్యాగు పోయిన విషయాన్ని గుర్తించి గైడ్ విజయ్‌కుమార్‌కు ఫోన్ చేసి చెప్పారు. దీంతో అతను వాచ్‌మెన్ సాయంతో బ్యాగును గుర్తించి తిరిగి అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మల్లూరు(మంగపేట), న్యూస్‌టుడే: మండలంలో మల్లూరు ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటనలో వాహనం నడుపుతున్న హరికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తూరు-మొట్లగూడెం చెందిన పొదెం హరికృష్ణ బుధవారం సాయంత్రం బ్రాహ్మణపల్లిలోని తన అత్తగారింటికి వెళ్తున్నాడు. మల్లూరు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో హరికృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఏటూరునాగారం సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సలహా మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ప్రధానోపాధ్యాయుడికి పురస్కారం

గోవిందరావుపేట, న్యూస్‌టుడే: గోవిందరావుపేట మండలం కర్లపల్లి గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాడియా గాంగూ నాయక్‌ను బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు వరించింది. రెండు రోజుల క్రితం తిరుపతిలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి సమావేశంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా ఈ అవార్డును గాంగూ నాయక్‌కు ప్రదానం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అయన కనబర్చిన నిబద్ధతకు గుర్తుగా అందజేసినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి సుబ్రమణియన్, కార్యదర్శి ప్రేమ్‌రాజ్, సిని నటుడు జి.విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



బహుజనుల పితామహుడు కాన్షీరాం


వెంకటాపురం మండల కేంద్రంలో..

వెంకటాపురం, న్యూస్‌టుడే: కాన్షీరాం వర్ధంతిని బుధవారం పలు చోట్ల నిర్వహించారు. బహుజనుల ఆశయాలు, హక్కులకై నిరంతరం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని వక్తలు పేర్కొన్నారు. వెంకటాపురం మండల కేంద్రంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగ ఐకాస రాష్ట్ర కన్వీనర్ కొడారి వినాయకరావు, జిల్లా ఉపాధ్యక్షుడు యాసం రమేశ్, నాయకులు గోపి, వెంకటేశ్వర్లు, నరేశ్, రాంబాబు, అంజి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు: ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ తరుణ్ మహారాజ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నాయకులు కరుణాకర్, యుగంధర్, అన్వేష్, శ్యామల్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో మాదిగలకు అన్యాయం'

ములుగు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేయకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి మాదిగలకు అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ, ఎమ్మెస్పీ జాతీయ నాయకులు ఇరుగుపైడి మాదిగ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వారు మాట్లాడారు. మాదిగల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఎస్సీలలో ఉన్న 59 ఉప కులాలకు సామాజిక న్యాయం చేయాలని డిమాండు చేశారు. డీఎస్సీ నియామకాల వల్ల మాదిగ, మాదిగ ఉప కులాలు వారికి రావాల్సిన ఉద్యోగాల వాటాను కోల్పోతారని, తెలిసే ప్రక్రియ చేపట్టారన్నారు. కచ్చితంగా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ధర్నాకు ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు, నాయకులు గజ్జల ప్రసాద్, గుగ్గిళ్ల నరేంద్ర, నెమలి నర్సయ్య, ప్రశాంత్, బలరాం, రవిందర్, శ్యాం, మొగిలి, రామస్వామి, లక్ష్మణ్, శంకర్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

జూదరులకు కౌన్సెలింగ్?

వెంకటాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని నల్లగుంటలో వివిధ గ్రామాలకు చెందిన పలువురు ప్రముఖులు మంగళవారం రాత్రి జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు పట్టుకొని వెంకటాపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది. ఆన్‌లైన్‌లో మనీ ట్రాన్స్‌ఫర్ చేస్తూ.. ఎనిమిది మంది జూదం ఆడినట్లు గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేసినట్లు సమాచారం. సామాన్యులతే పట్టుకొని జైలుకు తరలిస్తారని, సంపన్నుల విషయంలో ఇలా వ్యవహరించడంలో ఆంతర్యమేంటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జూదరులపై కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎస్సై సతీష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఎవరిని స్టేషన్‌కు తీసుకురాలేదన్నారు.


ములుగు సంక్షేమ భవనంలో


వెంకటాపురం మండలం ఎదిర పీహెచ్‌సీ వద్ద


వాజేడు మండలం గుమ్మడిదొడ్డిలో

ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు కొనసాగుతున్నాయి. మహిళలు రంగురంగుల పూలను తెచ్చి అందంగా బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ ఆటపాటలతో పల్లెలన్నీ కనువిందు చేస్తున్నాయి. బుధవారం సాయంత్రం జరిగిన వేడుకల్లో మహిళలు, చిన్నారులు ఆడిపాడి సందడి చేశారు.

– న్యూస్‌టుడే, యంత్రాంగం